సాక్షి వనపర్తి

మంగళవారం ၊ 4 ၊ ఫిబ్రవరి ၊ 2025



వైభవంగా పుష్పరథోత్సవం

గంగాపురం చెన్నకేశవస్వామి ఆలయంలో పుష్ప రథోత్సవం నిర్వహించారు.

వివరాలు 8లో ▸



జములమ్మ బ్రహ్మోత్సవాలు

జములమ్మ బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
36.0 /14.9

వాతావరణం

ఉదయం, రాత్రివేళ చలి తీవ్రత ఉంటుంది. మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

నారాయణకే మరో చాన్స్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియామకం



వనపర్తిటౌన్‌: బీజేపీ జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణకు మరో చాన్స్ దక్కింది. 2024 జనవరి 18న జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నారాయణకు రెండోసారి అవకాశం కల్పిస్తూ.. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీకి చెందిన జెడ్పీ మాజీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డితో పాటు వివిధ విభాగాలకు రాష్ట్ర, జిల్లా బాధ్యతలు నిర్వర్తిస్తున్న బి.శ్రీశైలం, కుమారస్వామి, సీతారాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, చిత్తారి ప్రభాకర్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు జిల్లా అధ్యక్ష పదవి కోసం తీవ్రస్థాయిలో పోటీ పడినప్పటికీ.. నారాయణకే మళ్లీ అవకాశం లభించింది. జిల్లాలో పార్టీకి 31వేల సభ్యత్వాలు లక్ష్యంగా కేటాయిస్తే.. ఆయన 35వేల సభ్యత్వాలు చేయించారు. 307 పోలింగ్ బూత్‌ల్లో 228 కమిటీలను ఏర్పాటు చేశారు. అదే విధంగా జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌పీఎస్ ప్రసాద్ క్షేత్రస్థాయిలో సేకరించిన అభిప్రాయాలకు అనుగుణంగా జిల్లా పార్టీ బాధ్యతలు మళ్లీ నారాయణ చేతికే చిక్కాయి.

పార్టీని విజయతీరాలకు చేర్చడమే లక్ష్యం..

బీజేపీని విజయతీరాలకు చేర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు జిల్లా అధ్యక్షుడు నారాయణ తెలిపారు. రెండోసారి అధ్యక్షుడిగా ఆయన నియామకం కావడంతో సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని గుర్తించి మరోసారి అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో వనపర్తి నుంచి 63వేల ఓట్లు రాబట్టామన్నారు. పార్టీని మరింత బలమైన శక్తిగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఎన్నికలు



ఆత్మకూర్‌: స్వయం సహాయక మహిళా సంఘాలతో పాటు జిల్లా, మండల, గ్రామైక్య సంఘాలకు నూతన బైలా ప్రకారం ఎన్నికలు ఉంటాయని అడిషనల్ డీఆర్డీఓ బాషా అన్నారు. సోమవారం స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో అమరచింత, ఆత్మకూర్ మహిళా సంఘాల ప్రతినిధులు, ఏపీఎంలు, సీసీలు, వీఓఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత బైలా ప్రకారం ప్రతినిధుల పదవీ కాలం రెండేళ్లు ఉండేదని.. కొత్త బైలా ప్రకారం పదవీ కాలాన్ని ఐదేళ్లకు పెంచినట్లు వివరించారు. ఎన్నికల అధికారి పర్యవేక్షణలో బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా మాక్ పోలింగ్ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎంలు వెంకట్, శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డి, సీసీలు ఆంజనేయులు, అన్వర్‌పాషా, తిరుపతమ్మ, బీసన్న తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో కార్మిక, కర్షకులకు మొండిచేయి



వనపర్తి: కేంద్ర బడ్జెట్‌లో కార్మిక, కర్షకులకు మొండిచేయి చూపడం సిగ్గుచేటని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేశ్వరాచారి, ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా నాయకుడు ఎం.ఆంజనేయులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సోమవారం సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాత వ్యవసాయ మార్కెట్‌యార్డు ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలకు వ్యతిరేకంగా ఉందన్నారు. కేవలం కార్పొరేట్ పెట్టుబడిదారుల కోసం బడ్జెట్ కేటాయింపులు జరిగినట్లుగా ఉందన్నారు. ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో నిధులు పెంచకపోవడంతో పాటు రైతు రుణమాఫీ పథకాన్ని విస్మరించినట్లు తెలిపారు. ఇది ప్రజావ్యతిరేక బడ్జెట్ అని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు నందిమల్ల రాములు, జి.బాలస్వామి, మద్దిలేటి, రాములు, సాయిలు, రాంచందర్, రామకృష్ణ పాల్గొన్నారు.

‘స్థానిక’ సందడి!

మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ స్థానాలు ఖరారు

- జిల్లాలో కొత్త స్థానాలపై అభ్యంతరాలు నిల్
- 132కు పెరిగిన సంఖ్య
- ఎన్నికల నిర్వహణకు అధికారుల కసరత్తు



మండలాల వారీగా ఎంపీటీసీ స్థానాలు..

మండలం	స్థానాలు
ఏదుల	8
వనపర్తి	11
పెబ్బేరు	9
శ్రీరంగాపూర్	6
చిన్నంబావి	8
ఖిల్లాఘనపురం	12
పెద్దమందడి	11
కొత్తకోట	12
గోపాల్‌పేట	9
మదనాపురం	8
ఆత్మకూరు	7
అమరచింత	5
పాన్‌గల్	14
వీపనగండ్ల	8
రేవల్లి	4

వనపర్తి: త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని ప్రభుత్వ పెద్దల ప్రకటనలతో గ్రామ రాజకీయాల్లో సందడి నెలకొంది. మరోవైపు అధికారులు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పనులను వేగంగా పూర్తి చేస్తున్నారు. పంచాయతీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు వెనువెంటనే నిర్వహిస్తారనే చర్చకు ఊతమిచ్చేలా జిల్లాలో మండల ప్రాదేశిక నియోజకవర్గ స్థానాల ఖరారు ప్రక్రియను అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. ఇదివరకు 14 మండలాలతో ఉన్న జిల్లాలో.. కొత్తగా ఏదుల మండలం ఏర్పాటు కావడంతో వాటి సంఖ్య 15కు చేరింది. గత ప్రాదేశిక ఎన్నికల సమయంలో జిల్లా వ్యాప్తంగా 128 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. అయితే కొత్తగా ఏర్పడిన ఏదుల మండలంలో నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి ఆరు గ్రామపంచాయతీలను విలీనం కావడంతో అదనంగా నాలుగు ఎంపీటీసీ స్థానాలను ఏర్పాటు చేశారు. వీటిపై మూడు రోజుల్లోగా అభ్యంతరాలను తెలియజేయాలని గతనెల 30వ తేదీన జిల్లా పరిషత్ అధికారులు ముసాయిదా జాబితాను విడుదల చేశారు. అయితే ఎలాంటి అభ్యంతరాలు రాకపోవడంతో జిల్లాలో పెరిగిన ఎంపీటీసీ స్థానాలు అమల్లోకి రానున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 15 మండలాల్లో ఎంపీటీసీ స్థానాల సంఖ్య 132కు చేరింది.



ఏదుల మండలంలో కొత్త ఎంపీటీసీ స్థానాలపై ముసాయిదా జాబితాను విడుదల చేస్తున్న అధికారులు (ఫైల్)

161కి చేరిన జీపీల సంఖ్య..

జిల్లాలో గ్రామపంచాయతీల సంఖ్య 255 **నుంచి 261కి చేరింది. కొత్త** మండలం **ఏదులలో నాగర్‌కర్నూల్ జిల్లా** నుంచి గుండియా వాల్యానాయక్ తండా, మాచుపల్లి, **ముత్తిరెడ్డిపల్లి, రేకులపల్లి తండా,** సింగర్‌పల్లి, **తుర్కదిన్నె** గ్రామపంచాయతీలను **విలీనం చేయడంతో వనపర్తి** జిల్లా **పరిధిలోకి వచ్చాయి. ఆయా జీపీల్లో ఎన్నికలు నిర్వహించేందుకు** అధికారులు **కసరత్తు చేస్తున్నారు. అయితే** ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తారని స్థానిక అధికార పార్టీలో చర్చ సాగుతోంది.

ఏర్పాట్లు ముమ్మరం..

మండల పరిషత్ ప్రాదేశిక స్థానాలకు ఎప్పుడు ఎన్నికలు వచ్చినా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్న ఎన్నికల అధికారుల ఆదేశం మేరకు జిల్లా పరిషత్ అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పెరిగిన స్థానాల మేరకు 677 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. 500 మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రంలో ఐదుగురు, 700 మంది ఓటర్లు ఉన్న పీఎస్‌లో ఆరుగురు సిబ్బందితో ఎన్నికల నిర్వహణ చేపట్టనున్నట్లు అధికారులు వివరించారు. ఎన్నికలకు అవసరమైన 604 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. అదే విధంగా బ్యాలెట్ పేపర్ ముద్రణతో పాటు ఎన్నికల సిబ్బంది నియామకం, శిక్షణ కార్యక్రమాలను పూర్తిచేశారు. ఈనెల ఒకటో తేదీన రానున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు స్థానిక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడంతో ఎన్నికల హడావుడి మొదలైంది.

సిద్ధం ఉన్నాం..



ప్రాదేశిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. అందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఎంపీటీసీ స్థానాలపై అభ్యంతరాల కోసం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. దీంతో కొత్త మండలమైన ఏదులలో 8 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు ఉంటాయి.

– యాదయ్య, జెడ్పీ సీఈఓ

చిన్నారుల్లో నులిపురుగులను నివారిద్దాం



ప్రజావాణిలో ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

- 1–19 ఏళ్లలోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: చిన్నారుల్లో రక్తహీనత, అనారోగ్యానికి కారణమయ్యే నులిపురుగులను నివారించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ఫిబ్రవరి 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు ఆల్బెండజోల్ మాత్రలు సరఫరా చేసి.. 1–19 ఏళ్లలోపు వారందరికీ మాత్రలు వేసేలా పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అటెండెన్స్ సమయంలోనే విద్యార్థులకు మాత్రలు అందించాలని సూచించారు. పిల్లల్లో నులిపురుగుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫిబ్రవరి 10న ఏదైనా కారణంతో మాత్రలు వేసుకోకుండా మిగిలిన వారికి 11నుంచి 17వ తేదీలోగా మాత్రలు వేయాల్సి ఉంటుందన్నారు. ఆల్బెండజోల్ మాత్రలకు ఏ ఒక్క విద్యార్థి దూరం కాకూడదన్నారు. 1–2 ఏళ్ల వయసులోపు చిన్నారులకు సగం మాత్ర, 2–3 ఏళ్ల పిల్లలకు 400 ఎంజీ ఒక మాత్ర చూర్ణం చేసి తినిపించాలన్నారు. 4 నుంచి 19 ఏళ్ల వారికి 400 ఎంజీ ఒక మాత్ర వేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల, కళాశాల స్థాయిలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు విజయవంతం చేయాలన్నారు. చిన్నారులు మట్టిలో ఆడటం, తర్వాత నేరుగా తినడం వల్ల శరీరంలో నులిపురుగులు తయారవుతాయని వివరించారు. ఈ పురుగులు ప్రేగుల్లో ఉండి రక్తాన్ని పీల్చుకుంటాయని.. తద్వారా పిల్లల్లో రక్తహీనత, అనిమియా ఏర్పడుతుందన్నారు. పిల్లలు భుజించిన ఆహారం ఒంటికి పట్టకపోవడం.. సరైన ఎదుగుదల ఉండకపోవడం.. తరచూ అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. నులిపురుగుల నివారణకు 1–19 ఏళ్లలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని తల్లిదండ్రులను కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, జి.వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, జెడ్పీ సీఈఓ యాదయ్య, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు సాయినాథ్‌రెడ్డి, పరిమళ తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి..

ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, జి.వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రహ్మణ్యంతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ప్రజావాణి, జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణికి మొత్తం 32 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

పోలీసు ప్రజావాణికి 11 అర్జీలు

వనపర్తి: పోలీసు ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు సత్వరం పరిష్కరించాలని ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని అర్జీలు స్వీకరించారు. మొత్తం 11 అర్జీలు అందాయని.. బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల విచారణలో జాప్యం జరగకుండా.. వీలైనంత త్వరగా పరిష్కరించాలని తెలిపారు.



ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ రావుల గిరిధర్

విధుల్లో నిర్లక్ష్యంపై పుర కమిషనర్ ఆగ్రహం

వనపర్తి టౌన్‌: జిల్లా కేంద్రమైన వనపర్తి మున్సిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు సోమవారం వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది నుంచి మొదలుకుని అధికారుల వరకు విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పనితీరును సరిదిద్దుకోవాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

మహిళా సంఘాల తోడ్పాటు అవసరం..

మున్సిపాలిటీ పరిధిలో ఆస్తిపన్ను వసూలుకు మహిళా సంఘాలు తోడ్పాటు అందించాలని.. తద్వారా పన్ను వసూళ్లలో వేగం పెరుగుతుందని కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వాటర్ లైన్‌మెన్లు, బిల్ కలెక్టర్లు, ఆర్పీలు, మెప్మా అధికారులతో వేర్వేరుగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలకు ఆస్తిపన్ను చెల్లింపుపై అవగాహన కల్పించడంలో మహిళా సంఘాలు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. బిల్ కలెక్టర్లు బ్లాక్‌ల వారీగా నిర్దేశించిన ఆస్తిపన్ను లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. వాటర్ లైన్‌మెన్లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కాగా, ఇక్కడి నుంచి బదిలీ అయిన కమిషనర్ పూర్ణచందర్‌ను వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

- మున్సిపాలిటీలో వివిధ రకాల దుకాణాల ట్రేడ్ లైసెన్స్ కోసం నియమించిన బృందాలు చేతికి డబ్బులు తీసుకోవద్దని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక బృందాలు వ్యాపారులకు ఫోన్లు చేసి ట్రేడ్ లైసెన్స్ తీసుకునేలా నచ్చచెప్పాలని సూచించారు. అయినప్పటికీ వినకుంటే శాఖాపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి



వనపర్తి టౌన్‌: జిల్లా కేంద్రంలో సోమవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని సరస్వతీ మాతకు అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. వందలాది చిన్నారులతో సామూహికంగా అక్షరాభ్యాసం చేయించారు. భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. అదే విధంగా అవోపా ఆధ్వర్యంలో బాలుర జూనియర్ కళాశాలలో సరస్వతీ మాతకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శిశుమందిర్ పాఠశాలలో సరస్వతీ దేవి జన్మదిన వైభవాన్ని తెలుగు భాషా సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు కె.నారాయణరెడ్డి విద్యార్థులకు వివరించారు. అర్చకులచే హోమం నిర్వహించారు. చింతల హనుమాన్ ఆలయంలో గురుస్వాములు ధర్మయ్య, బాలు ఆధ్వర్యంలో చింతల రామలింగేశ్వరుడిని ఉజ్జయిని మహా కాళేశ్వరుడిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా

వనపర్తి టౌన్‌: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తామని ఎస్‌ఈ రాజశేఖరం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పుడిప్పుడే ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో డిమాండ్ మేరకు విద్యుత్ అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో విద్యుత్ లైన్ల మార్పిడి, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుతున్నట్లు వివరించారు.



అమ్మవారి శకటాలు, కలశాలతో ఊరేగింపు

జోగుళాంబకు జేజేలు

- నిజరూప దర్శనమిచ్చిన అమ్మవారు
- ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు
- చివరి రోజు సహస్ర ఘట్టాలకు ప్రత్యేక పూజలు
- పంచామృతాలతో అమ్మవారికి అభిషేకాలు
- ఉత్సవాలకు వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

వివరాలు 8లో ▸



అభిషేకం అనంతరం అలంకరణలో జోగుళాంబ దేవి

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు

పాన్‌గల్‌: మండల కేంద్రంలో ఈదమ్మ జాతర ఏర్పాట్లను సోమవారం వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీఐ కృష్ణ పరిశీలించారు. మంగళవారం జరిగే ఈదమ్మ రథోత్సవం (సిడే) కార్యక్రమాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా వాహనాల నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లపై ఆలయ కమిటీ సభ్యులు, పోలీసులతో చర్చించారు. జాతర సందర్భంగా భక్తుల రద్దీ తీవ్రంగా ఉండనున్న నేపథ్యంలో వాహనాలు గ్రామంలోకి అనుమతించకుండా గ్రామ శివారులోనే పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. దీంతోపాటు రథం లాగే సమయంలో ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా రథానికి ఇరువైపులా రోప్ పార్టీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతర ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు సీఐతో పాటు ఆరుగురు ఎస్‌ఐలు, 70 మంది పీసీలతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానిక పోలీసులకు సూచించారు. వారి వెంట ఎస్‌ఐ శ్రీనివాసులు ఉన్నారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి రజని

వనపర్తి: ఇంటి పనులతో మహిళలు ఎక్కువగా ఒత్తిడికి గురవుతుంటారని.. వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి రజని అన్నారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం గోపాల్‌పేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. మహిళలు అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శరీరంలో ఏమైనా గడ్డలు కట్టడం.. అవి క్రమంగా పెరగడాన్ని క్యాన్సర్‌గా గుర్తించాలన్నారు. ప్రాథమిక దశలోనే చికిత్స చేయించుకోవడంతో త్వరగా నయం అవుతుందన్నారు. ఆరోగ్య సంరక్షణపై నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. అనంతరం జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం గోపాల్‌పేట పీహెచ్‌సీలో మహిళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లో 57 క్యాన్సర్ కేసులు ఉన్నాయన్నారు. వాటికి ప్రధాన కారణం పొగ తాగడం, ఆల్కాహాల్ సేవించడం, ఆహారపు అలవాట్లలో మార్పులతో క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఉత్తరయ్య, డా.ఝాన్సీ, డా.మంజుల పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో రెవెన్యూ మేళా

వనపర్తి: జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలో ఆస్తిపన్ను, నల్లా బిల్లుల చెల్లింపులు, ఇతర సమస్యల పరిష్కారానికి సోమ, గురువారాల్లో రెవెన్యూ మేళా నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్, మున్సిపాలిటీల ప్రత్యేకాధికారి సంచిత్ గంగ్వార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెవెన్యూ మేళా ద్వారా ప్రజలకు అనేక రకాల సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి మున్సిపాలిటీ కార్యాలయంలో సోమ, గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ప్రాపర్టీ పేరు మార్పు, మ్యుటేషన్ సేవలు, ఇంటి నంబర్ కేటాయింపు లేదా మార్పు వంటి సేవలు పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐదుగురు ఎస్‌ఐలకు స్థానచలనం

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఐదుగురు ఎస్‌ఐలకు స్థానచలనం కల్పించడంతో పాటు ముగ్గురు ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పించి, బదిలీ చేస్తూ సోమవారం జోగుళాంబ జోన్–7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్‌ఐ	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పి.శ్రీనివాసరావు	డీసీఆర్‌బీ, గద్వాల	అయిజ
విజయ్‌భాస్కర్	అయిజ	వీఆర్, వనపర్తి
కె.తిరుపాజీ	బాలానగర్	వీఆర్, మహబూబ్‌నగర్
ఎ.పర్వతాలు	వీఆర్, మహబూబ్‌నగర్	వీఆర్, నాగర్‌కర్నూల్
డి.లెనిన్	వీఆర్, నాగర్‌కర్నూల్	బాలానగర్

- ఏఎస్‌ఐలుగా ఉన్న ముగ్గురిని ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పించిన తర్వాత లయక్ అలీ నాగర్‌కర్నూల్ నుంచి గద్వాల, అజం అలీని మహబూబ్‌నగర్ నుంచి నాగర్‌కర్నూల్, భవనయ్యను నారాయణపేట నుంచి నాగర్‌కర్నూల్‌కు బదిలీ చేశారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: విద్యుదాఘాతంతో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మున్సిపాల్టీలోని ఉయ్యాలవాడలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన ఎల్లయ్య (60) తన ఇంట్లో విద్యుత్ బల్బు తీసేందుకు ప్రయత్నిస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా, తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

ప్రమాదవశాత్తు పెద్దవాగులో పడి..

మాగనూర్: మండల కేంద్రంలోని రైల్వే వంతెన సమీపంలో పెద్దవాగులో ప్రమాదవశాత్తు పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపిన వివరాలు.. మాగనూర్‌కి చెందిన నామలి రాములు(37) కొన్ని రోజులుగా మద్యానికి బానిసై నిత్యం భార్య వసంతతో గొడవపడేవాడు. దీంతో నెల రోజుల క్రితం ఆమె పుట్టింటికి(వర్కూర్ గ్రామానికి) వెళ్లిపోయింది. కాగా సోమవారం ప్రమాదవశాత్తు రాములు వాగులో పడి మృతిచెందగా ఈ విషయాన్ని గ్రామస్తులు ఆమెకు తెలిపారు. హుటాహుటిన అక్కడికి చేరుకొని భర్త మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమైంది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని మక్తల్ ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

చిన్నచింతకుంట : గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన చిన్నచింతకుంట మండలం అమ్మాపురంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాలు.. అమ్మాపురం గ్రామంలోని కురుమూర్తి స్వామి ఆలయం సమీపంలోని వెంచర్ వద్ద గుర్తు తెలియని మహిళ(50) మృతి చెంది ఉందన్న గ్రామస్తుల సమాచారం మేరకు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతురాలి ఆచూకి తెలిసిన వారు చిన్నచింతకుంట పోలీస్ స్టేషన్ నంబర్ 87126 59354, 87126 59316కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ పేర్కొన్నారు.

పెళ్లి కాలేదని ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: పెళ్లి కాలేదని మనస్తాపం చెంది ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వేపూరిగేరికి చెందిన బోయ శ్రీనివాసులు(39) సోమవారం ఉదయం పట్టణంలోని టీడీగుట్ట రైల్వే గేట్ దగ్గర కోంగూ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు శ్రీనివాసులు తండ్రి చిన్నతనంలోనే చనిపోయాడు. తల్లి ఆరోగ్యం సరిగా లేదు. ఒంటరిగా జీవిస్తున్న శ్రీనివాసులుకు పెళ్లికాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది, జీవింతపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

గడ్డివాము దగ్ధం

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి శివారులో గడ్డివాము దగ్ధమైన ఘటన సోమవారం జరిగింది. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పిచ్చిగుంట్ల నర్సిములు పోల్కంపల్లి శివారులో వ్యవసాయ పొలం వద్ద గడ్డివాము వేశాడు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ జంపర్ వద్ద నిప్పురవ్వలు చెలరేగి గడ్డిపై పడటంతో మంటలు అంటుకున్నాయి. సమీప రైతులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ప్రమాదంలో సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు.

సైబర్ మోసం

మహబూబ్‌నగర్ క్రైం: సైబర్ నేరగాళ్లు లింక్స్ పేరుతో ఇద్దరు బాధితుల ఖాతాల నుంచి రూ.1.15 లక్షల నగదు మాయం చేశారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఇద్దరు వేరువేరుగా ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ సీఐ అప్పయ్య కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గోల్ మజీద్ ఏరియాకు చెందిన మహ్మద్ రావూఫ్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఫోన్‌కు ఆదివారం టెలిగ్రాం యాప్ ద్వారా ఒక లింక్ వచ్చింది. ఈ యాప్ ద్వారా కొద్దిగా డబ్బులు పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని చెప్పి నమ్మించి లింక్ క్లిక్ చేసే విధంగా చేశారు. ఆ తర్వాత సైబర్ నేరగాళ్లు ఖాతా లో నుంచి రూ.86వేలు మాయం చేశారు. మరో ఘటనలో పాతపాలమూరుకు చెందిన నాగరాజు ఫోన్‌లో వాట్సాప్‌కు ఒక లింక్ వచ్చింది. ఆ లింక్ క్లిక్ చేసి ఓపెన్ చేసిన క్షణాల వ్యవధిలో ఖాతాలో ఉన్న రూ.29వేలు మాయం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లారీ దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు మండల పరిధిలోని కుక్కలదొడ్డి పంచాయతీ ప్రధాన రహదారిపై గతనెల 28వ తేదీన జరిగిన లారీ దొంగతనం కేసులో తెలంగాణ రాష్ట్రం, గద్వాల్ జిల్లా, మాన్వాడాకు చెందిన షేక్ మౌలాలిని అరెస్టు చేశారు. ఈమేరకు నిందితుడిని సోమవారం సీఐ హేమసుందర్, ఎస్‌ఐ నవీన్ బాబు కోర్టులో హాజరు పరిచారు. రైల్వేకోడూరు సివిల్ కోర్టు జడ్జి నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించారు.



జోగుళాంబ అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో బారులు దీరిన భక్తులు..



ఆలయ పాలక మండలితో కలిసి కలశాలతో వస్తున్న సీఎం సోదరుడు తిరుపతి రెడ్డి..



కలశాలతో జోగుళాంబ సేవాసమితి సభ్యులు

జోగుళాంబకు జేజేలు

నిజరూప దర్శనమిచ్చిన అమ్మవారు

- ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు
- చివరి రోజు సహస్ర ఘట్టాలకు ప్రత్యేక పూజలు
- పంచామృతాలతో అమ్మవారికి అభిషేకాలు
- ఉత్సవాలకు వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

అలంపూర్: జోగుళాంబ మాతకు జేజేలు అంటూ భక్తులు భక్తిపారవశ్యంతో ఉప్పొంగారు. అలంపూర్ క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు, వసంత పంచమిని పురస్కరించుకొని సోమవారం జోగుళాంబ అమ్మవారు నిజరూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా జోగుళాంబ అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారి నామాన్ని స్మరిస్తూ సహస్ర కలశాలను సమర్పించారు. అర్చక స్వాములు వేద మంత్రాలతో అమ్మవారిని పంచామృతాలతో పాటు భక్తులు సమర్పించిన కలశాలతో అభిషేకాలు నిర్వహించారు. పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చక్కెర, పండ్ల రసాలు, కుంకుమ, పసుపు, భస్మం, గంధం, పన్నీరు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. ఈ ఘట్టాన్ని తిలకించడానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. నిజరూపంలో అమ్మవారి అభిషేకాలను తిలకించిన భక్తులు తన్మయం చెందారు. అమ్మవారి నిజరూప దర్శనం కలగడం అదృష్టంగా భావించారు. అనంతరం జోగుళాంబ సేవాసమితి అధ్యక్షుడు బండి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వెంకన్నబాబు ఆధ్వర్యంలో గంటలేశ్వర ఆలయం వద్ద జోగుళాంబ జాతరను ప్రారంభించారు. గ్రామ దేవతల వేషధారణలో 40 మంది కళాకారులు నృత్యాలు చేస్తూ.. జోగుళాంబ అమ్మవారి శకటం, కలశాలతో మహిళలు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు.



అలంపూర్ వీధుల్లో భక్తుల ఊరేగింపు



కలశాలతో వస్తున్న ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే విజయుడు

సహస్ర కలశాలకు ప్రత్యేక పూజలు..

జోగుళాంబ అమ్మవారి సహస్ర ఘట్టాభిషేకం కనుల పండువగా జరిగింది. కుంకుమార్చన మండపంలో సర్వతోభద్రమండలిపై స్థాపించిన 1008 కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఈఓ పురేందర్ కుమార్, అర్చకులు సంప్రదాయ పద్ధతిలో నవ ఔషధులతో కలశాలను పూజించి హారతి సమర్పించారు. అనంతరం కలశాలను శిరస్సున ధరించి.. అర్చక స్వాములు త్రిశూల స్వామితో మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారి గర్భాలయానికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు జోగుళాంబ అమ్మవారి నిజరూప దర్శనభాగ్యం కల్పించారు.

పూర్ణాహుతి సమర్పణ..

వార్షిక బ్రహ్మోత్సవాల చివరి రోజు యాగశాలలో నిత్యహోమాలు, మహా పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, సహస్ర ఘట్టాలకు ఆవాహన అర్చన వంటి విశేష పూజలు నిర్వహించారు. ఐదు రోజులపాటు కొనసాగిన చండీ హోమాలు, ఆవాహిత దేవతా హోమాలకు చివరి రోజు పూర్ణాహుతి సమర్పించి.. బ్రహ్మోత్సవాలకు పరిసమాప్తి పలికారు. యాగరక్షను అమ్మవారి మూలవిరాట్‌కు సమర్పించిన అనంతరం భక్తులకు అందజేశారు. యాగశాలలోని కలశాలను ఉద్వాసన చేసి.. ఊరేగింపుగా గర్భాలయానికి తీసుకెళ్లారు. పూర్ణాహుతిలో ఎమ్మెల్యే విజయుడు పాల్గొన్నారు.



యాగశాలలో పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు



గ్రామదేవతల వేషధారణలో కళాకారులు

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు..

సహస్ర ఘట్టాలతో అభిషేకాల అనంతరం అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించి.. రకరకాల పూలమాలలు, నిమ్మకాయల హారాలు, స్వర్ణాభరణాలతో అలంకరించారు. అనంతరం ఆలయ అర్చక స్వాములు అమ్మవారికి దశవిధ హారతులు సమర్పించారు. అభిషేకించిన పంచామృతాలను భక్తులకు తీర్థంగా అందజేశారు. నిత్యాన్నదాన సత్రం, కేకే సత్యం దాత సహకారంతో అన్నప్రసాదం అందజేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో అలంపూర్ క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. సామాన్య భక్తులు అమ్మవారి దర్శనం కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. సీఐ రవిబాబు, ఎస్‌ఐ వెంకటస్వామి ఆధ్వర్యంలో దాదాపు 150 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆలయాలను దర్శించుకున్న ప్రముఖులు..

జోగుళాంబ అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. జిల్లా జడ్జి కుశ, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు సరస్వతి, నాగశిరోమణి, విశ్వనాథ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, గోపాల్, జి.వెంకటేశ్వర్లు, ఎ.వెంకటేశ్వర్లు, జి.పులెందర్, జగన్మోహన్ నాయుడు, జగదీశ్వర్ గౌడ్, జయరాముడు, ఉప ప్రధాన అర్చకుడు, ఎక్స్ అఫీషియో సభ్యుడు డి.ఆనంద్ శర్మ పాల్గొన్నారు.



కమనీయం.. ఆది దంపతుల కల్యాణం

వార్షిక బ్రహోత్సవాలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో ఆది దంపతులు జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి వారి శాంతి కల్యాణం కనులపండువగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ఆలయ చైర్మన్, ఈఓ పట్టువస్త్రాలను సమర్పించగా.. అర్చక స్వాములు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. సాయంత్రం ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు.

ఆది దంపతుల కల్యాణం జరిపిస్తున్న అర్చక స్వాములు

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు



మహబూబ్‌నగర్ రూరల్ : మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. స్వామివారి ఉత్సవాలు ఈనెల 7 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం 12న నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏడాది స్వామివారి ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తారు.ఉత్సవాల్లో భాగంగా దేవస్థానం, పరిసర ప్రాంతాలు రంగులు వేసే కార్యక్రమం ప్రారంభించారు. కొండపైనున్న వెంకటేశ్వర స్వామి ఉత్సవాలు ముగిసిన నెల రోజులకు దిగువ కొండ వద్ద నున్న అలివేలు మంగతాయారు అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తారు. దీనిని దృష్టిలో పెట్టుకొని దిగువకొండ వద్దనున్న దేవస్థానం వద్ద కూడా పనులు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్, ఈఓ శ్రీనివాసరాజుల ఆధ్వర్యంలో చేపడుతున్నారు. దాదాపు నెల రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా పలు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి తరలి రానున్నారు.

బాధిత కుటుంబానికి రూ.10 లక్షల సాయం



తల్లిదండ్రులకు చెక్కును అందజేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

జడ్చర్ల: మండలంలోని ఉదండాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు రిజర్వాయర్ నిర్మాణ పనులకు సంబంధించి తవ్విన భారీ నీటి మడుగులో ప్రమాదవశాత్తు జారీ పడి దుర్మరణం చెందారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి రూ.10 లక్షల సాయం సోమవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో అందజేశారు. ఉదండాపూర్ గ్రామానికి చెందిన మల్లయ్య, పార్వతమ్మ దంపతుల కూతురు భాగ్యలక్ష్మి(06), కుమారుడు మహేశ్(04)లు నీటి గుంతలో ప్రమాదవశాత్తు జారీ పడి మృతిచెందారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్పందించి గుత్తేదారులతో మాట్లాడి రూ.10 లక్షల సాయం ఇచ్చే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు. అనంతరం చిన్నారుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ ఆదిరెడ్డి, నాయకులు బుక్కా వెంకటేశం, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్ప రథోత్సవం

- రథసప్తమి పురస్కరించుకుని నేడు పెద్దతేరు

జడ్చర్ల టౌన్: గంగాపురం ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పుష్పరథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ రాజగోపురం ఎదురుగా చిన్నతేరును ఉంచి పుష్పాలతో అలంకరించి బలిహరణం, హోమం జరిపించారు. వేదపండితుల మంత్రోచ్చరణాలతో రథానికి పూజలు చేశారు. ఆలయం నుంచి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను మేళతాళాలు, భక్తుల గోవింద, చెన్నకేశవస్వామి నామస్మరణల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై ప్రతిష్ఠించారు. ఉత్సవ విగ్రహాలకు పూజలు చేసిన పండితులు తాడుతో రథాన్ని లాగి, గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. అర్ధరాత్రి వరకు జరిగిన ఊరేగింపు గ్రామ చివరన ముగించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. రథసప్తమిని పురస్కరించుకుని మంగళవారం రాత్రికి స్వామికి పెద్ద తేరు (రథోత్సవం) నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. రథోత్సవానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు.

తరలివస్తున్న భక్తులు

బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన రథోత్సవ ఘట్టాన్ని తిలకించేందుకు గంగాపురం గ్రామానికి భక్తుల తాకిడి పెరిగింది. పెద్ద సంఖ్యలో సోమవారం సాయంత్రం నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఇక గంగాపురం గ్రామం కులమతాలకు అతీతంగా సందడి నెలకొంది. ప్రతి ఇంట్లో బంధువుల రాక మొదలయ్యింది.ముఖ్య కూడళ్లన్నీ విద్యుద్దీపాల అలంకరణలతో వెలుగులు విరజిమ్ముతున్నాయి. ప్రధాన రోడ్లకు ఇరువైపులా మిఠాయిలు, తినుబండారాలు, ఆటవస్తువులు, గాజులు, అలంకరణ సామగ్రి దుకాణాలు వెలిశాయి.



పుష్ప రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రిలే నిరాహార దీక్ష

రాజోళి: పెద్ద ధన్వాడలో నిర్మించనున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారంనాటికి 12 వ రోజుకు చేరింది. ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్రామానికి నష్టం చేకూరేవిధంగా కంపెనీ నిర్మిస్తూ చూస్తూ ఊరుకోమని మహిళలు హెచ్చరించారు. ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మహిళలు పాల్గొన్నారు.



దీక్ష చేపట్టిన మహిళలు

భూసార పరీక్షలతో మేలు

- పంటలు లేని కాలంలోనే మట్టిని సేకరించాలి
- పోషక విలువలు తెలుసుకునే అవకాశం
- జిల్లా వ్యవసాయాధికారి జాన్ సుధాకర్

■ పాడి పంట

కోస్గి రూరల్: వ్యవసాయంలో భూసార పరీక్షలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. నేల స్వభావం, లవణ పరిమాణంతో పాటు సూక్ష్మ, స్థూల పోషకాలు ఏ స్థాయిలో ఉన్నాయో, ఆ భూమి ఏయే పంటలకు అనుకూలమో ఈ పరీక్షల వల్లే తెలుస్తుంది. రైతులకు అందజేసే కార్డుపై ఈ వివరాలతో పాటు పంటలకు ఏ మోతాదులో ఎరువులు వేయాలో సూచిస్తారు. ఒక్కసారి భూసార పరీక్షలు చేయించుకుంటే ఆ ఫలితాల ఆధారంగా రెండు, మూడేళ్ల పంటలు సాగుచేసుకోవచ్చు.

పంటలు లేని కాలంలోనే..

పంటలు లేనప్పుడు మాత్రమే మట్టి సేకరించాలి. ఏడాదికి ఒక పంట పండించే భూమిలో ఫిబ్రవరి, ఏప్రిల్ మధ్యకాలంలో, రెండు పంటలు పండించే రైతులు మే లో నమూనాలు సేకరించాలి. నేలరకం, సాగునీటి వసతి, మిట్ట, పల్లం, సేద్య పద్ధతుల ఆధారంగా వేర్వేరు నమూనాలు తీసుకోవాలి. పొలమంతా ఒకే రకంగా ఉంటే ఐదెకరాల విస్తీర్ణానికి ఒకే మట్టి నమూనా తీస్తే సరిపోతుంది. మట్టి నమూనా తీసే ప్రదేశంలో నేలపై చెత్త, చెదారం ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పారతో ఆంగ్ల అక్షరం వీ ఆకారంలో 15 నుంచి 24 సెంటీమీటర్ల గుంత తవ్వి, పై నుంచి దిగువకు ఒకే మందంలో పలుచని పార వచ్చేలా మట్టి తీయాలి. ఇలా 1 నుంచి 12 చోట్ల మట్టిని సేకరించాలి. అన్ని చోట్ల సేకరించిన మట్టిని గోనె పట్టా లేదా పాలిథీన్ షీట్ లేదా వస్త్రం మీద పోసి చిదమడంతో పాటు మట్టిని చతురస్రాకారంగా పరచి నాలుగు భాగాలుగా విభజించాలి. ఈ విధంగా నాలుగైదు సార్లు చేసి చివరకు 500గ్రాములు మట్టి నమూనాను ప్లాస్టిక్ సంచిలో నింపి, దాంతోపాటు నమూనా వివరాలను తెలిపే పత్రాన్ని వివరాలతో పాటు పరీక్షా కేంద్రానికి పంపాలి.



మట్టి నమునాలను సేకరిస్తున్న అధికారులు (ఫైల్)

మట్టి సేకరణలో జాగ్రత్తలు

చెట్ల కింద, గట్ల పక్కన, కంచెల వద్ద నమూనాలను సేకరించొద్దు. పేడ ఇతర ఎరువులు వేసిన చోట, రసాయన ఎరువులు వేసిన నెల రోజుల వరకు నమూనాలు తీసుకోరాదు. అదేవిధంగా నీరు నిలిచి బురద ఉన్న నేలల నుంచి నమూనాలు సేకరించకూడదు. అన్ని జాగ్రత్తలు తీసుకొని సేకరించిన మట్టి నమూనాలను జిల్లా కేంద్రంలోని కేంద్రానికి పరీక్షలకు పంపాలి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– జాన్ సుధాకర్, జిల్లా వ్యవసాయ అధికారి

పేటలో యువకుడి దారుణ హత్య

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఓ యువకుడు హత్యకు గురైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రాజస్థాన్ రాష్ట్రంలోని భరత్‌పూర్ జిల్లా బయనా తాలూకా శీతల్పూర్ గ్రామానికి చెందిన శివరాజ్, విక్రమ్‌సింగ్, కారు అనే ముగ్గురు యువకులు నాలుగేళ్ల క్రితం బతుకుదెరువు కోసం మహబూబ్‌నగర్‌కు వచ్చారు. విక్రమ్‌సింగ్, కారు ఇద్దరు వ్యక్తులు నారాయణపేట పట్టణంలో టైల్స్ పనులు చేసేందుకు ఇటీవలే వచ్చారు. అయితే సోమవారం ఉదయం 9 గంటలకు నారాయణపేట నుంచి కారు శివరాజుకు ఫోన్ చేసి విక్రమ్‌సింగ్ చనిపోయాడని, ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహం ఉంచారని సమాచారం అందించాడు. వెంటనే శివరాజు నారాయణపేటకు చేరుకొని ఘటన వివరాలు తెలుసుకున్నాడు. అనంతరం నారాయణపేట పోలీస్‌స్టేషన్ వెళ్లి.. తన బామ్మర్ది విక్రమ్ సింగ్ సోమవారం ఉదయం 3.25 గంటలకు బస్టాండ్ నుంచి వెళ్తుండగా కొంత మంది పండ్ల వ్యాపారస్తులు అతడిని జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లోకి తీసుకువెళ్లి చంపాలనే ఉద్దేశంతో కొట్టారని ఫిర్యాదు చేశారు. మాదం బాలరాజు, చింత గోపి, దాసరి రాజు, గుర్మిట్కల్ నరేష్, ఎండీ రఫీ విక్రమ్‌సింగ్‌ను కొట్టి చంపినట్లు తనకు అనుమానం ఉందని, వారిపై చర్య తీసుకోవాలని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివశంకర్ పేర్కొన్నారు. విక్రమ్ సింగ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. దర్యాప్తు చేస్తున్న పోలీసులు అనుమానితులు ఐదుగురిని పట్టుకునేందుకు గాలిస్తున్నారు.



విక్రమ్‌సింగ్ మృతదేహం


ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న వాసు

వలంటీర్ల కోసం సమిధనవుతా..

- కూటమి ప్రభుత్వం వారిని విధుల్లోకి తీసుకోకుండా వేధింపులు
- సర్కారు తీరును నిరసిస్తూ యువకుడి ఆత్మహత్యాయత్నం

సాక్షిప్రతినిధి, విజయవాడ: 'కష్టాల్లో ఉన్న వలంటీర్ వ్యవస్థను కాపాడుకుందాం.. కరోనా సమయంలో వారు చేసిన సేవలను గుర్తిద్దాం. మనలోని మానవత్వాన్ని చాటుకుందాం' అంటూ ఓ యువకుడు బ్యానర్‌ను ప్రదర్శిస్తూ విజయవాడలోని అంబేడ్కర్ స్మృతివనం దగ్గర సోమవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. వలంటీర్లపై టీడీపీ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న కక్షపూరిత ధోరణిని నిరసిస్తూ ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన నక్కా వాసు ఒంటిపై పెట్రోల్ పోసుకుని లైటర్‌తో నిప్పు అంటించుకుంటుండగా.. అక్కడే విధుల్లో ఉన్న సూర్యారావుపేట సీఐ అబ్దుల్ అలీషేక్ అడ్డుకున్నారు. అనంతరం సూర్యారావుపేట స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా విధుల్లోకి తీసుకోవాలని వలంటీర్లు చేస్తున్న ఆందోళన తనను కలిచి వేసిందన్నాడు. కరోనా సమయంలో సొంత వాళ్లే దగ్గరకు రాని దుర్భర పరిస్థితుల్లో వలంటీర్లు ప్రజలకు మర్చిపోలేని సేవలందించారని గుర్తుచేశాడు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు నేడు పింఛన్ కోసం పడరాని పాట్లు పడుతున్నారని, వలంటీర్లు ఉన్న రోజుల్లో హాయిగా ఇళ్ల వద్దే పింఛన్‌లు తీసుకున్నారని చెప్పారు. అప్పటి నుంచే వలంటీర్ వ్యవస్థకు అభిమానిగా మారానని, అంతటి సేవ చేసిన వలంటీర్లను ప్రస్తుత ప్రభుత్వం విధుల్లోకి తీసుకోకుండా వేధిస్తుండటంపై మనస్తాపానికి లోనై ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించినట్టు చెప్పాడు. వాసు కొన్నేళ్లుగా తండ్రితో కలిసి ఉండవల్లి సమీపంలోని పోలకంపాడులో ఉంటున్నాడు. కుంచనపల్లిలో నాటు కోళ్ల ఫాంను నడుపుతూ విజయవాడ, గుంటూరు, మంగళగిరి ప్రాంతాల్లోని చికెన్ షాపులకు నాటు కోళ్లను సరఫరా చేస్తుంటాడు. వాసు తండ్రి ఫైర్ స్టేషన్‌లో పని చేస్తుంటాడు. వాసుకు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదు. కేవలం వలంటీర్ వ్యవస్థ రావాలని బలంగా కోరుకుంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

కూటమి కాలకేయుల సాక్షిగా..

ప్రజాస్వామ్యం ఖూనీ!

ఏపీలో మున్సిపల్ ఉప ఎన్నికల్లో అధికార మదంతో అరాచక పర్వం

సాక్షి ప్రతినిధి, తిరుపతి, సాక్షి, అమరావతి, నెట్‌వర్క్: ఆదిమ తెగల్లోనూ కానరాని అకృత్యాలు టీడీపీ కూటమి సర్కారు పాలనలో ఆవిష్కృతమయ్యాయి! పట్టపగలు.. తిరుపతి నడి రోడ్డుపై పోలీసులు, జనం సాక్షిగా ప్రజాస్వామ్యం ఖూనీ అయింది. తాలిబన్లు.. ఐసిస్.. హమాస్ ఉగ్రమూకలను తలదన్నే రీతిలో రాష్ట్రవ్యాప్తంగా మునిసిపల్ ఉప ఎన్నికల్లో పచ్చ ముఠాలు దాడులకు తెగబడి విధ్వంసం, భయోత్పాతం సృష్టించాయి! పలు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో చైర్మన్‌లు, డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్మన్ పదవులకు సోమవారం జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ నేతలు అరాచకాలకు తెగబడ్డారు. అసలు ఒక్క సీటు కూడా గెలవని చోట్ల.. తమకు ఏమాత్రం సంఖ్యా బలం లేని చోట్ల భయపెట్టి నెగ్గేందుకు కూటమి పార్టీలు కుతంత్రాలకు దిగాయి. పోలీసులతోపాటు ఆర్డీవో.. కలెక్టర్ దాకా ప్రభుత్వ వ్యవస్థలన్నింటినీ వాడుకుంటూ అధికార దుర్వినియోగానికి బరి తెగించాయి. బల ప్రయోగం, అక్రమాలు, అరాచకాలు, ప్రలోభాలతో ప్రజాస్వామ్య వ్యవస్థకే కళంకం తెచ్చేలా వ్యవహరించాయి. మునిసిపల్ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా పార్టీ గుర్తులతో జరిగాయి. అలాంటిది.. ఒక పార్టీ గుర్తుపై నెగ్గిన వారిని భయపెట్టి, ప్రలోభాలకు గురి చేసి ఇంత దారుణంగా ఫిరాయింపులకు ప్రోత్సహిస్తుంటే.. అసలు ఇక ఎన్నికలు ఎందుకు? పార్టీ గుర్తులు ఎందుకు? అని ప్రజలు తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి డిప్యూటీ మేయర్ ఉప ఎన్నికలో నెగ్గేందుకు కూటమి పార్టీల గూండాలు అరాచకం సృష్టించారు. ఉప ఎన్నికలో పాల్గొనేందుకు వాహనంలో వెళ్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల బస్సు ఆపి రాళ్లతో అద్దాలు పగలగొట్టి లోపలకు చొరబడి దాడులకు తెగబడ్డారు. బస్సులో ఉన్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లపై దాడిచేసి చొక్కా పట్టుకుని ఈడ్చుకెళ్లారు. మహిళా కార్పొరేటర్ల ఆర్తనాదాలు ఖాకీల చెవికెక్క లేదు. కార్పొరేటర్లను బలవంతంగా లాక్కెళుతున్న కూటమి గూండాల వాహనాలకు పోలీసులు దగ్గరుండి దారిచ్చి సాగనంపడం నివ్వెరపరుస్తోంది. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు పోలీసుల సాక్షిగా కూటమి గూండాలు చిత్తూరు, తిరుపతిలో సృష్టించిన అరాచకం ఇదీ!!

మూడు నగర కార్పొరేషన్లు, ఏడు మున్సిపాలిటీల్లో ఖాళీ అయిన డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు సోమవారం ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేయగా టీడీపీ నేతల దౌర్జన్యాలు, దాడులు, బెదిరింపులతో సగం చోట్ల ఐదు చోట్ల ఎన్నికలు జరగకుండా వాయిదా పడటం గమనార్హం.


వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల బస్సు అద్దాలను పగలగొడుతున్న కూటమి గూండా శంకర్‌యాదవ్


తిరుపతిలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను కిడ్నాప్ చేసి కారులో తీసుకెళుతున్న కూటమి గూండాలు

అర్ధరాత్రి నుంచి అరాచకం..

మూడేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుపతి కార్పొరేషన్‌లో మొత్తం 49 డివిజన్లకు గానూ 48 చోట్ల వైఎస్సార్‌సీపీ గెలుపొందింది. వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయరెడ్డి సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేయడంతో తిరుపతి డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ పదవులకు రాజీనామా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డిప్యూటీ మేయర్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడింది. కూటమికి ఒకే ఒక్క కార్పొరేటరే ఉన్నా అధికార బలంతో దాన్ని దక్కించుకునేందుకు కుట్రలకు తెర తీశారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ సెనెట్ హాలులో సోమవారం డిప్యూటీ మేయర్ ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. ఉప ఎన్నికలో ఎలాగైనా గెలవాలనే కుయుక్తులతో కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను కిడ్నాప్ చేసేందుకు సిద్ధమయ్యారు. .

బస్సుని అడ్డుకుని.. అద్దాలు ధ్వంసం చేసి

డిప్యూటీ మేయర్ ఉప ఎన్నిక కోసం సోమవారం ఉదయం 11 గంటలకు కార్పొరేటర్లంతా భూమన నివాసం నుంచి ప్రత్యేక బస్సులో ఎస్వీ యూనివర్సిటీలోని సెనెట్ హాలు వద్దకు బయలు దేరారు. దాదాపు 25 మంది కార్పొరేటర్లు, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం అందులో ఉండగా వర్సిటీ సమీపంలో వారి బస్సును కూటమి గూండాలు అడ్డుకున్నారు. సుమారు 500 మంది ఒకేసారి బస్సుపైకి దూసుకొచ్చి పోలీసుల సమక్షంలోనే రాళ్లతో అద్దాలను పగులగొట్టారు. లోపలకు చొరబడి బస్సు తలుపు తెరిచారు. బస్సులో ఉన్న అమరనాథరెడ్డి, అనీష్‌రాయల్, మోహన్‌కృష్ణ యాదవ్, భోగం అనిల్, వెంకటేష్‌పై దాడిచేసి చొక్కా పట్టుకుని ఈడ్చుకెళ్లారు. అప్పటికే సిద్ధంగా ఉన్న వాహనాల్లో కార్పొరేటర్లను బలవంతంగా ఎక్కించి అతివేగంగా దూసుకెళ్లారు. బస్సులో ముందు వైపు కూర్చున్న మహిళా కార్పొరేటర్లను నెట్టుకుంటూ లోపలకు చొరబడడంతో భయభ్రాంతులకు గురయ్యారు. కార్పొరేటర్లు కేకలు వేస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. కార్పొరేటర్లను కాపాడకపోగా మిగిలిన వారిపై దౌర్జన్యానికి దిగారు.

ఎంపీ, సాక్షి ప్రతినిధులపై దాడి

కార్పొరేటర్లతో పాటు బస్సులో ప్రయాణిస్తున్న ఎంపీ గురుమూర్తిపై కూడా కూటమి గూండాలు దాడికి యత్నించారు. బస్సు ముందు సీట్లో కూర్చొని ఉన్న ఎంపీపై రాళ్లతో దాడి చేసేందుకు యత్నించగా గన్‌మెన్‌ను చూసి వెనక్కి తగ్గారు. ఈ అరాచకాలను చిత్రీకరిస్తున్న సాక్షి ప్రతినిధి, సాక్షి ఫోటోగ్రాఫర్‌పై దాడి చేశారు. ఎమ్మెల్యే కుమారుడు ఆరణి మదన్, సునీల్ చక్రవర్తి ఫోటోగ్రాఫర్ చేతిలోని రూ.రెండు లక్షలు విలువచేసే కెమెరాను లాక్కుని ధ్వంసం చేశారు. సెల్‌ఫోన్లో ఘటనను చిత్రీకరిస్తున్న సాక్షి ప్రతినిధిపై కూడా దాడికి తెగబడ్డారు. ఉదయం 10.15 గంటల నుంచి 10.45 వరకు యథేచ్ఛగా సాగిన విధ్వంసంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. కూటమి నేతల విధ్వంస కాండతో రాకపోకలన్నీ స్తంభించిపోయాయి.

బస్సులో, వాహనాల్లో ప్రయాణిస్తున్న వారు ఈ ఘటనను చూసి 'ఇంత అరాచకమా? ఇంత బరి తెగింపా?' అంటూ నివ్వెరపోయారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



'సచివాలయం'లో నీడ కరువు

రాష్ట్ర సచివాలయం ప్రధాన గేట్ల వద్ద నిలువ నీడలేక.. వివిధ పనులపై వచ్చే సందర్శకులు, అక్కడ విధులు నిర్వహించే సెక్యూరిటీ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రం నలుమూలలనుంచి వచ్చే ప్రజలు గేట్-2 నుంచి లోపలికి వెళ్లాల్సి ఉంటుంది. అయితే ముందుగా పాస్‌లు తీసుకున్నాక, పోలీసు సిబ్బంది తనిఖీ తర్వాత వారిని అనుమతిస్తారు. ఈ నేపథ్యంలో అక్కడ చాలా సేపు వేచి ఉండాల్సి ఉంటుంది. గేట్ల వద్ద నీడనిచ్చే సదుపాయం లేక ఎండైనా, వానైనా అలాగే ఉండాల్సి వస్తోంది. అలాగే గేట్-4 వద్ద కూడా పరిస్థితి ఇలాగే ఉంది. వచ్చేది ఎండాకాలం కావడంతో ఇక్కడ టెంట్ లాంటివి ఏర్పాటు చేయాలని, తాగునీటి సదుపాయం కల్పించాలని సందర్శకులు కోరుతున్నారు.

– సాక్షి, హైదరాబాద్

'ఏఐ' అంటే హైదరాబాద్ గుర్తుకు రావాలి

- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- కొత్త సవాళ్లకు యువత సిద్ధంగా ఉండాలి
- డీటీసీసీ కార్యాలయం ప్రారంభించిన మంత్రి


డీటీసీసీ కార్యాలయం ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

సాక్షి, హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ)లో రాష్ట్ర యువతను నిపుణులుగా తీర్చి దిద్దాలనే సంకల్పంతో ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. సోమవారం హైటెక్ సిటీలో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సేవలు అందిస్తున్న డిపాజిటరీ ట్రస్ట్ క్లియరింగ్ కార్పొరేషన్(డీటీసీసీ) నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. 200 ఎకరాల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏఐ సిటీని నిర్మించనున్నామని, అక్కడే ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేసి, దాని నిర్వహణలో సంబంధిత పరిశ్రమలను, ఏఐ నిపుణులను భాగస్వాములను చేస్తామని చెప్పారు. ఏఐ అంటే తెలంగాణ, హైదరాబాద్ అని గుర్తుకు వచ్చేలా తీర్చి దిద్దుతామన్నారు. రోజురోజుకీ టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతోందని, అదే సమయంలో కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో యువత వినూత్నంగా ఆలోచించి, వాటి పరిష్కారాల కోసం నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించా రు. ఆ దిశగా కృషి చేసే వారికి ప్రభు త్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలతో పాటు అన్ని రంగాలకు చెందిన కంపెనీలున్నాయని, అలాంటివి 100 నుంచి 120 కంపెనీలు ఇక్కడి నుంచే ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సేవలందిస్తున్నాయని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. అన్ని రకా ల పరిశ్రమలను స్థాపించేందుకు అనువైన వాతావరణం తెలంగాణలో ఉందన్నారు. దేశంలో డీటీసీసీ తన రెండో కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించడం సంతోషంగా ఉందని, తద్వారా సుమారు 500 మందికి కొత్తగా ఉపాధి దొరకబోతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఈ కంపెనీలో 2వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. వీటిలో అధిక శాతం తెలంగాణ యువతకు ఇవ్వాలని కోరగా, అందుకు యాజమాన్యం అంగీకరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీటీసీసీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రెనీ లారోకే మోరీస్, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ లిన్ బిషప్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో విద్యార్థినులకు అస్వస్థత

అమరచింత: మండలంలోని కేజీబీవీలో చదువుతున్న ఐదుగురు విద్యార్థినులకు అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండు రోజుల కిందట కేజీబీవీలో 8, 9 తరగతులు చదువుతున్న ఐదుగురు విద్యార్థినులు జలుబు, జ్వరం, కడుపునొప్పితో బాధపడటంతో వీరిని పట్టణంలోని డీఎంఆర్ఎం ఆస్పత్రికి తీసుకొచ్చారు. తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం సోమవారం రాత్రి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని పాఠశాల ఎస్ఓ స్వప్న రాణికి వివరణ కోరగా 270 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని వీరిలో 5 మంది విద్యార్థులు వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారని, వారిని ఆస్పత్రికి తరలించామన్నారు.

చిరుత దాడిలో ఆవు మృత్యువాత

మరికల్: మండలంలోని పూసల్‌పహాడ్ శివారులో సంజీవకొండ సమీపంలో గుట్టల ప్రాంతంలో గొల్ల నర్సింహులు వ్యవసాయ పొలం వద్ద కట్టేసిన పశువుల్లో అర్ధరాత్రి సమయంలో ఆవుపై చిరుత దాడి చేయడంతో అక్కడికక్కడే మృత్యువాత పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఈ విషయంపై గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం ఘటనా స్థలంలో అటవీశాఖ బీట్ అధికారి మల్లేష్ మృతి చెందిన ఆవును పరిశీలించారు. ఈ ప్రాంతంలో చిరుత సంచరిస్తోందని, రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



వేప చెట్టుకు 'కల్లు'

మండలంలోని వెంకాయపల్లి శివాంజనేయ ఆలయం ఎదుట ఉన్న వేపచెట్టుకు రెండు రోజులుగా కల్లు కారుతుంది. గమనించిన గ్రామస్తులు సోమవారం కల్లు కారుతున్న ప్రదేశంలో కుండ కట్టారు. ఈత, తాటి కల్లు చూశాం.. కానీ వేప కల్లు కారడం ఎప్పుడు చూడలేదని స్థానికులు చర్చించుకుంటున్నారు.

– తిమ్మాజిపేట

అవినీతిమయం

పాలమూరు మెడికల్ కాలేజీలో వసూళ్ల పర్వం

- ప్రతి పనికో రేటు
- దుర్భాషలాడుతున్న సిబ్బంది
- లోపించిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నర్సులు



పాలమూరు: 'మీరు వచ్చినప్పుడే మేము పని చేసి పెట్టాలా? మాకు ఫ్రీగా ఉన్నప్పుడే చేస్తాం.. ప్రతి పనికి ఓ రేటు ఉంటుంది, ఆ ప్రకారం ఫస్ట్ ఫార్మాలిస్ పూర్తి చేసి రావాలి'.. అంటూ తోటి సిబ్బంది అనే మర్యాద లేకుండా ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడుతున్నారు పాలమూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల అధికార, సిబ్బంది. పాలమూరు మెడికల్ కాలేజీలో పనిచేసే కొందరు సిబ్బంది నిర్వాకంతో కళాశాలకు చెడ్డ పేరు రావడంతో పాటు పూర్తి అవినీతిమయంగా మారింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్కడ పని చేసే వాళ్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఫార్మాలిస్ట్ ఉంటాయి..

కళాశాల పరిధిలో విధులు నిర్వహించే స్టాఫ్ నర్సులు, హెడ్ నర్సులకు సంబంధించిన సర్వీస్ బుక్ రాయడంతో పాటు ఇతర పనులు ఏదీ కావాలన్నా అక్కడ పనిచేసే ఓ మహిళా అధికారిణి, ఓ ఉద్యోగి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం.ఆ అధికారిణి నర్సులతో డబ్బులు వసూలు చేసే క్రమంలో ఫార్మాలిస్ ఉంటాయి.. వెళ్లి సెక్షన్‌లో కలువండి అంటూ దబాయిస్తున్నారు. నర్సులకు వచ్చే మొదటి నెల జీతం వచ్చినప్పుడు మొదటి నెల జీతం పేరుతో కొంత వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పుడు రెగ్యులరేషన్ కోసం దరఖాస్తులు చేసుకుని నాలుగు నెలలు గడుస్తున్న క్రమంలో ఇప్పటివరకు దీనిపై పరిశీలన జరగలేదు. ప్రధానంగా సర్వీస్ బుక్‌లో డబ్బులు ఇస్తే కానీ రాయడం లేదు. ఎందుకు డబ్బులు అడుగుతున్నారని నర్సులు ప్రశ్నిస్తే మీ దిక్కు ఉన్న చోట చెప్పుకొండి అంటూ వారిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు. సదరు అధికారినిపై ఫిర్యాదు చేయడానికి నర్సులు పలుమార్లు డైరెక్టర్‌ను కలువడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. ఇక చివరికి మెడికల్ కళాశాల అధికారుల, సిబ్బంది అవినీతి వ్యవహారంపై నర్సులు కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. న్యాయం కోసం ఏసీబీ అధికారులను ఆశ్రయించాలని నర్సులు అనుకొని, చివరకు ఆ ప్రయత్నం విరమించుకున్నారు. ఇప్పటికైనా మెడికల్ కళాశాలపై కలెక్టర్‌తో పాటు డీఎంఈ సైతం దృష్టిసారించి వ్యవస్థను చక్కదిద్దాల్సిన అవసరం ఉంది.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

పాలమూరు మెడికల్ కళాశాలలో అవినీతి వ్యవహారంపై మెడికల్ కళాశాల డైరెక్టర్ డా.రమేష్‌ను వివరణ కోరగా ఇలాంటి ఘటనలు తన దృష్టికి రాలేదన్నారు. బాధితులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే అలాంటి వారిపై తప్పక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

నేటినుంచి జములమ్మ బ్రహ్మోత్సవాలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం



అమ్మవారి మూలవిగ్రహం.. విద్యుదీపాల వెలుగులో ఆలయ సముదాయం

గద్వాల న్యూటౌన్: నడిగడ్డ ప్రజల ఇలవేల్పు.. భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న జములమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని జమ్ములమ్మ, పరశురాముడి ఆలయాలను రకరకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ఆర్చి వద్ద ఏర్పాటు చేసిన విద్యుదీపాల అలంకరణ, కాళికామాత విగ్రహం ఆకట్టుకుంటున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారిని వేలాది మంది భక్తులు దర్శించుకోనున్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

గుర్రంగడ్డ నుంచి జమ్మిచేడుకు..

గద్వాల మండలంలోని కృష్ణానది దివి గ్రామమైన గుర్రంగడ్డ జమ్ములమ్మ అమ్మవారి పుట్టినిల్లుగా చరిత్ర చెబుతోంది. అక్కడి నుంచి ప్రతిఏటా మాఘశుద్ధ పౌర్ణమికి ముందు అమ్మవారిని మెట్టినిల్లు అయిన జమ్మిచేడులోని ఆలయానికి ఆహ్వానించేందుకు ఎద్దుల బండి బయలుదేరుతుంది. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 11 గంటలకు గుర్రంగడ్డ గ్రామానికి బండి బయలుదేరనుండగా ప్రత్యేకంగా పూజలు చేస్తారు. గుర్రంగడ్డలోని కృష్ణానది ఒడ్డున జములమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించి, అమ్మవారిని బుధవారం తెల్లవారుజామున ఎద్దుల బండిపై తీసుకువస్తారు. ఉదయం 6 గంటలకు మెట్టినిల్లు అయిన జమ్మిచేడులోని జములమ్మ, పరశురాముడి ఆలయానికి చేరుకుంటుంది.

వైభవంగా పౌర్ణమి వేడుకలు..

ఈ నెల 12 మాఘశుద్ధ పౌర్ణమి బుధవారం రోజు అమ్మవారి సన్నిధిలో వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు జరిపించి, ప్రత్యేకంగా అలంకారం చేస్తారు. అదేరోజు సాయంత్రం పల్లకీసేవ నిర్వహిస్తారు. ఈ వేడుకలకు నడిగడ్డతోపాటు ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు.

ఏర్పాట్లు పూర్తి...

జములమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక క్యూలైన్‌లు, వైద్య సేవలు అందుబాటులో ఉంచాం. తాగునీటి సౌకర్యం కల్పించాం.

– పురేందర్‌కుమార్, ఆలయ ఈఓ

గగన్‌చంద్ర ప్రతిభ అద్భుతం


గగన్‌చంద్ర, తల్లిదండ్రులను సన్మానిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వంశీకృష్ణ

కందనూలు/ బల్మూర్: త్రీ ఇన్ వన్ సైకిల్‌ను రూపొందించిన విద్యార్థి గగన్‌చంద్ర ప్రతిభ అద్భుతం అని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. గత నెల 31న 'సాక్షి'లో ప్రచురితమైన 'హైటెక్ కుర్రాడు' కథనానికి స్పందిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా అభినందించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే సోమవవారం నాగర్‌కర్నూల్ వచ్చిన వారు స్థానిక కొల్లాపూర్ చౌరస్తాలో గగన్‌చంద్రతోపాటు తల్లిదండ్రులు భాస్కర్, నాగరాణిలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. తల్లిదండ్రులు పేదవారైనా.. కొడుకు సొంతంగా హైబ్రీడ్ త్రీ ఇన్ వన్ సైకిల్‌ను రూపొందించడానికి సహకరించడం అభినందనీయమని అన్నారు. గగన్‌చంద్రకు ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సహించడంతోపాటు అతని కుటుంబానికి ఆర్థికంగా బాసటగా నిలుస్తామని మంత్రి, ఎమ్మెల్యే పేర్కొన్నారు.

'సాక్షి'కి కృతజ్ఞతలు..

తమ కుమారుడు ఏడేళ్ల వయసు నుంచే చిన్న చిన్న ప్రయోగాలతో వివిధ రకాల పరికరాలు తయారు చేసేవాడని గగన్‌చంద్ర తల్లి నాగరాణి పేర్కొన్నారు. అతనిలోని ఆసక్తి, ప్రతిభను గుర్తించి తల్లిదండ్రులుగా ఖర్చు భరిస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ క్రమంలోనే హైబ్రీడ్ త్రీ ఇన్ వన్ సైకిల్‌ను రూపొందించగా జాతీయ స్థాయికి ఎంపికవడం, దీనిపై 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో ముఖ్యమంత్రి స్పందించారని, రాష్ట్రవ్యాప్తంగా తెలిసిందని, ఇందుకు కారణమైన 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

అనంతపూర్ టు పాకిస్తాన్ బోర్డర్

- అనంతపురం జిల్లా యువకుడి పాదయాత్ర


44వ నంబర్ జాతీయ రహదారిపై పాదయాత్ర చేస్తున్న ప్రదీప్‌కుమార్

అడ్డాకుల: రైతులు, సైనికులకు మద్దతుగా అనంతపురం జిల్లాకు చెందిన యువకుడు పాకిస్థాన్ బోర్డర్ వరకు చేపట్టిన పాదయాత్ర సోమవారం అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని 44వ నంబర్ జాతీయ రహదారిపై కొనసాగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లా కేంద్రానికి చెందిన పెయింటర్ నాగభూషణం, పుష్పలత దంపతుల కుమారుడు ప్రదీప్‌కుమార్ ఇంటర్ పూర్తి చేశాడు. స్వార్థం లేకుండా పని చేసేది రైతులు, సైనికులేనని, వారికి మద్దతుగా జనవరి 26న ఏపీలోని అనంతపురం నుంచి పంజాబ్ సరిహద్దులోని పాకిస్థాన్ బోర్డర్ వరకు పాదయాత్ర మొదలు పెట్టాడు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, హర్యాణ రాష్ట్రాల మీదుగా పంజాబ్ బోర్డర్ వరకు పాదయాత్ర సాగనుంది. 'అనంతపూర్ టు పాకిస్థాన్-బై వాక్ విత్‌అవుట్ మనీ' అనే నినాదంతో పాటు రైతులు, సైనికులకు సంబంధించిన లోగో ఉన్న ఫ్లెక్సీని, మువ్వన్నెల జాతీయ జెండాను వెనుక వైపు వేళాడదీసుకుని యాత్ర చేస్తున్నాడు. కుడిచేతిపై జై జవాన్, జై కిసాన్ అనే పచ్చబొట్టును వేయించుకున్నాడు. ప్రతి రోజు 30–40 కిలోమీటర్ల దూరం పాదయాత్ర చేస్తున్నట్లు ప్రదీప్ తెలిపాడు. 90 రోజుల్లో తన యాత్ర బోర్డర్‌కు చేరుకుంటుందని చెప్పారు. ఎవరితో ఎలాంటి సా యం తీసుకోకుండా పాదయాత్ర చేస్తున్నట్లు పేర్కొన్నాడు. ప్రతి ఒక్కరు స్వార్థంతోనే ఉంటారని కేవలం రైతులు, సైనికులే స్వార్థం లేకుండా పని చేస్తారని, వారికి మద్దతుగానే తాను యాత్ర చేపట్టినట్లు ప్రదీప్‌కుమార్ తెలిపారు.

క్రీడాకారుల విజయాలతో స్ఫూర్తి



క్రీడాకారులను అభినందిస్తున్న డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్

- డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్
- విజేతలకు అభినందనలు

మహబూబ్‌నగర్ క్రైం: క్రీడాకారుల విజయాలు పోలీస్ శాఖలో స్ఫూర్తి నింపాయని డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్ అన్నారు. జనవరి 28 నుంచి ఈనెల 1వ తేదీ వరకు కరీంనగర్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్-2024లో పతకాలు సాధించిన జోగుళాంబ జోన్ పోలీస్ క్రీడాకారులను సోమవారం జిల్లా పరేడ్ మైదానంలో డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్ అభినందించారు. జోగుళాంబ జోన్-7కు చెందిన క్రీడాకారులు 8 స్వర్ణ, 4రజతం, 12 కాంస్యం పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పతకాలను సాధించినవారిని ఘనంగా సత్కరించారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. రాబోయే రోజుల్లో జోగుళాంబ జోన్ క్రీడాకారులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్పీ డి.జానకి, అదనపు ఎస్పీలు రాములు, సురేష్‌కుమార్, నారాయణపేట ఏఆర్ అదనపు ఎస్పీ రియాజ్, డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, రవి పాల్గొన్నారు.